క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న సర్పంచ్ ఎ.పురుషోత్తమరెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సర్పంచ్ ఆలమ్మగారి పురుషోత్తమరెడ్డి చేతులమీదుగా ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తారని తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్న భోజనం అన్ని సక్రమంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. హెచ్ఎం జానకమ్మ, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ డే పురస్కరించుకొని, నాయకుడు తారక్‌నాథ్ 10వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలో వేదాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల గృహంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. యూనియన్ డే లో భాగంగా తమవంతుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని నాయకులు, బ్యాంక్ అధికారులు శ్రీనివాసులు, కెబి.బాస్కర్, బి.తిమ్మప్పలు తెలిపారు. బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోసిగి: మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఉండి చదువుకునేందుకు ఆసక్తి గల గ్రామీణ ప్రాంత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ కోటేశ్వరయ్య తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దాదాపు 250 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. హాస్టల్ వసతితో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక ట్యూటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులు వెనకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొగాకు అనర్థాలపై అవగాహన



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు తరచుగా తీసుకోవడం వల్ల కేన్సర్ ముప్పు పొంచి ఉంటుందన్నారు. అలాగే కేన్సర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయన్నారు. పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. ఏటా జూన్ 20న పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వైద్యులు చైతన్యకుమార్, సంధ్యాకుమారి, షేకున్‌బాను, సూపర్‌వైజర్ బాబురాజు, వైద్య సిబ్బంది మంజునాథ్, ఇందిర, సోమశేఖర్ స్వామి, వెంకటసుబ్బయ్య, చిన్నవెంకటయ్య, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో 'సీతా కల్యాణ వైభోగమే' చిత్ర యూనిట్



శ్రీమఠంలో సినీ నటులు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై 'సీతా కల్యాణ వైభోగమే' చిత్ర యూనిట్ సభ్యులు గురువారం మంత్రాలయంకు విచ్చేశారు. సినీ నిర్మాత రాచల యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నటీనటులు సుమన్ తేజ్, గరీమ చౌహన్, దేవరాజ్, పాలమూర్ మురళీధర్ గౌడ్, రమణా రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సాగర్ వచ్చారు. శుక్రవారం సీతా కల్యాణ వైభోగమే చిత్ర రిలీజ్‌ను పురస్కరించుకుని రాఘవేంద్ర స్వామి వారి దర్శనార్థం వచ్చినట్లు వారు తెలిపారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనానికి చేరుకుని పూజలు చేశారు. సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



పెద్దకడబూరు తహసీల్దారు కార్యాలయంలో మాజీ వీఆర్‌ఓలను సన్మానిస్తున్న దృశ్యం



మంత్రాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలకం
- ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవన్యూ శాఖ కీలకమైనదని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆవరణలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది, సబ్‌కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలం మునుపు నుంచే రెవెన్యూ శాఖ పుట్టుకొచ్చిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి వ్యక్తికి పుట్టుక నుంచి మరణం వరకు రెవెన్యూ శాఖతో అనుసంధానం కలిగి ఉంటుందన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ శాఖనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భూమికి సంబంధించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకం, ఆర్ఓఆర్, అడంగళ్, భూమి చుట్టూ కొలతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తూ ఎప్పటికప్పుడు రైతులకు సేవలందిస్తోందన్నారు. పదవీ విరమణ పొందిన రెవెన్యూ అధికారులు వారి అనుభవాలను, సందేశాలను రైతులకు, ప్రస్తుత రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. అనంతరం రెవెన్యూ శాఖలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులకు, పదవీ విరమణ పొందిన అధికారులకు సబ్ కలెక్టర్ చేత సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యాలయ పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, తహసీల్దార్ హసీనాసుల్తానా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఉప తహసీల్దార్లు రామేశ్వర్‌రెడ్డి, వలిబాషా, పెద్దయ్య, దీప, కౌసర్‌భాను, వినీత్, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు తహసీల్దార్ ఈరన్న, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సీనియర్ నాయకులు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ ద్వారా రైతులు, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. రైతులు తమ శాఖ నుంచి ఎలాంటి సేవలు ఆశిస్తున్నారో, ఎదుర్కొంటున్న లోటుపాట్లపై చర్చ కొనసాగించారు. మునుముందు రెవెన్యూ సేవలను రైతులకు సులభతరం చేసేందుకు శ్రమిస్తున్నామని తెలిపారు. డీటీ రాఘవేంద్ర, మండల సర్వేయర్ ఇస్మాయిల్, సీనియర్ అసిస్టెంట్ నూర్ అహ్మద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దారు సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రిటైర్డ్ వీఆర్‌ఓలు కృష్ణమూర్తి స్వామి, రామలింగారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గతేడాది జూన్ 20వ తేదీని రెవెన్యూ దినోత్సవంగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్ఐ మహేష్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని తహసీల్దార్ శేషారెడ్డి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో రెవెన్యూ సదస్సును ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలకమైందని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఆర్ఐ, వీఆర్వోలు, గ్రామ సేవకులు ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. రిటైర్డ్ డీటీలు రాజన్న, పోలకంటయ్య, ఆర్ఐ, వీఆర్వోలు, గ్రామ సేవకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

దర్గాకు పోటెత్తిన భక్తులు



ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

హెల్త్ సబ్ సెంటర్లకు ఫర్నీచర్ మంజూరు



కోసిగి ఆస్పత్రి వద్ద ఉంచిన ఫర్నీచర్

కోసిగి: మండల పరిధిలోని హెల్త్ సబ్‌సెంటర్‌లకు వివిధ రకాల ఫర్నీచర్ మజూరైనట్లు డాక్టర్ మనోజ్ కుమార్, ఫార్మసిస్ట్ సులోచన తెలిపారు. గురువారం జిల్లా వైద్యశాల నుంచి కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫర్నీచర్స్ వచ్చినట్లు వారు చెప్పారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేస్తున్న ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్, సెలైన్ స్టాండ్స్, బేసిన్స్, కుర్చీలు, స్ట్రెచర్స్, తదితర 14 రకాల పరికరాలు వచ్చినట్లు తెలిపారు. త్వరలో ఇక్కడి నుంచి గ్రామాల్లోనే హెల్త్ సెంటర్లకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, పరీక్షను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గౌస్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాల వెల్లడిలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నా అధికారులు గానీ, నాయకులు గానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. హర్యానా రాష్ట్రంలో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఏడు మందికి ఫస్ట్ ర్యాంకు రావడంపై పలు సందేహాలను వెలిబుచ్చినా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్లే ఇలాంటి ఫలితాలు వచ్చాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందిన ఏజెన్సీని రద్దు చేసి, విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ సీఐ భాస్కర్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటికి అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని సెబ్ సీఐ భార్గవ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలను వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిస కావడం ద్వారా అనారోగ్యంతో పాటు శారీరకంగా, మానసికంగా కృషించిపోవడమే గాకుండా చట్టపరంగా నేరస్థులవుతారని హెచ్చరించారు. ఇంటర్మీడియెట్ స్థాయిలో క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉన్నత చదువులకు వెళ్లగలరని అప్పుడే వారి భవిష్యత్‌కు మంచి మార్గం ఎంచుకునేందుకు వీలుంటుందని తెలిపారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలపై తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు కూడా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ జి.లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆదోని సెబ్ సీఐ విన్నీలత సూచించారు. ఈ మేరకు గురువారం మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవంలో భాగంగా పట్టణంలోని అక్షర జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు బానిసలై విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మద్యం, నాటుసారా, గుట్కా లాంటి వాటి జోలికి వెళ్లరాదన్నారు. సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ ఏర్పాటుతో సమస్య పరిష్కారం



ఇటాచీతో డ్రైనేజీ గుంతను తీస్తున్న దృశ్యం

కౌతాళం: దశాబ్దాల కాలం నాటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి వంక వరకు సరైన డ్రైనేజీ లేక వర్షపు నీరు, మురుగుతో కలిసి ముందుకు ప్రవహించకుండా అక్కడే నిలిచిపోయేది. అంతేకాక మురుగు నీరంతా గుంతల్లో నిలిచి దుర్గంధం వేదజల్లేది. ప్రస్తుతం ఆసుపత్రి రోడ్డు నుంచి వంక వరకు సమాంతర డ్రైనేజీ కాలువను తవ్వడంతో సమస్యకు పరిష్కారం దొరికింది. అత్తార్ వీధి, మంచాల్‌వీధి, స్టేట్ బ్యాంకు కాలనీ, మొయిన్ రోడ్డులోని నీరంతా ఈ డ్రైనేజీ నుంచే వెళుతుండడంతో సమస్య తీవ్రంగా ఉండేది. కాలనీ వాసుల వినతి మేరకు స్పందించిన ఉరుకుంద ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప గురువారం పోలీస్‌స్టేషన్ నుంచి డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తచెదారంను తొలగించడమే కాక సమాంతరంగా వంక వరకు కాలువ తీసి సమస్యకు పరిష్కారం చూపారు. ఎన్నో ఎళ్లుగా నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోగొట్టుకున్న బంగారు హారం అప్పగింత



బాధితురాలికి హారాన్ని అప్పగిస్తున్న ఎస్ఐ గోపినాథ్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన హైదరాబాద్‌కు చెందిన సుమతి అనే భక్తురాలు మూడు తులాల బంగారు హారాన్ని పోగొట్టుకుంది. చుట్టుపక్కల వెతికినా హారం దొరకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సదరు బంగారు హారం మంత్రాలయంలోని రాఘవేంద్ర పురానికి చెందిన అక్కమ్మకు దొరికింది. ఆమె నిజాయితీని చాటుకుంటూ గొలుసును పోలీస్‌స్టేషన్‌లో అందజేసింది. ఎస్ఐ గోపినాథ్ అక్కమ్మను అభినందించి బాధితురాలు సుమతికి హారాన్ని అందజేశారు.

టెక్నికల్ అసిస్టెంట్ల కమిటీ ఎన్నిక

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ యూనియన్ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గురువారం బనవాసిలోని జాతీయ ఉపాధి హామీ పథకం నర్సరీలో టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశం యూనియన్ గౌరవ సలహాదారులు గిడ్డయ్య, బషీర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అందరి అభిప్రాయాల అమోదం మేరకు ఏకగ్రీవంగా టెక్నికల్ అసిస్టెంట్ డివిజన్ అధ్యక్షుడిగా యు.తిరుమలేష్, సహ అధ్యక్షుడిగా యం.ఆనంద్, కార్యదర్శిగా జ్ఞానయ్య, జాయింట్ కార్యదర్శిగా హుసేని, ట్రెజరర్‌గా సువర్ణను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



గోనెగండ్లలో ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

గోనెగండ్ల: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని, ఇందుకు పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ కోరారు. గోనెగండ్లలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ అధికారులు విద్యార్థులచే కలిసి ఆయా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో 6 నుంచి 14 ఏళ్లలోపు ఉన్న పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. డ్రాపౌట్లను గుర్తించి తిరిగి బడుల్లో చేర్పించాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు నాగభూషణం, రహంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ప్రాంగణ ఎంపికలు

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం ప్రాంగణ ఎంపికలు (క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ అల్‌సెక్ టెక్నాలజీ వారు ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. ఎంపికైన విద్యార్థులు బెంగళూరు, చెన్నై వంటి పట్టణాల్లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల సాగుకు అదును దాటలేదు



గోనెగండ్లలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సమయం దాటిపోలేదని రైతులు ఆందోళన చెందనవసరం లేదని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత సూచించారు. వారు గురువారం మండలంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి పంటను సాగుచేసే రైతులు 125 రోజుల కన్నా తక్కువ సమయంలో పంట చేతికి అందే రకాన్ని సాగుచేసుకోవాలని, నేరుగా విత్తు పద్ధతిపై శ్రద్ధ వహించాలన్నారు. అలాగే జూలై 20వ తేదీ వరకు పత్తి పంటను సాగు చేసుకోవచ్చునని తెలిపారు. తేలిక నేలల్లో 50–60 మీ.మీటర్లు, బరువు నేలల్లో 60–75 మీ.మీ వర్షపాతం నమోదైన తరువాతనే పత్తి సాగుచేసుకోవాలన్నారు. పత్తిలో అంతర్ పంటగా కందిని సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా ఆగస్టు 15వ తేదీ వరకు కందిని సాగు చేసుకోవచ్చని తెలిపారు. మొక్కజొన్న పంటను జూలై 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చన్నారు. పెసర, మినుములను జూలై 15వ తేదీ వరకు ఆరుతడి పంటలైన ఆముదం, పొద్దు తిరుగుడు, ఉలువలను జూలై 31వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

రాంజల చెరువు నీరు బయటికి పంపింగ్



పైపుల ద్వారా చెరువు నుంచి వ్యర్థ జలాన్ని బయటకు వదులుతున్న దృశ్యం




నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో సగభాగానికి నీరు అందించే రాంజల నల్లచెరువులో పాచిపట్టి నీరు నిరుపయోగంగా మారడం, వాసన వెదజల్లుతుండడంతో వ్యర్థ జలాన్ని చెరువు నుంచి బయటకు పంపింగ్ చేసే కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఎంఈ చలపతిరావు ఆధ్వర్యంలో నీటి పంపింగ్‌ను చేపట్టారు. చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్లు వ్యర్థ నీటి పంపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. చెరువులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉన్నప్పటికీ ఆ నీరు తాగడానికి పనికిరాకపోవడంతో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కౌన్సిలర్ల విన్నపం మేరకు పాచి పట్టి వాసన వెదజల్లుతున్న నీటిని బయటకు పంపింగ్ చేస్తున్నారు. నీటిని బయటకు పంపింగ్ చేసి శుభ్రం చేసిన తర్వాత వర్షాల ద్వారా వచ్చే నీటిని చెరువులో నింపి పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే కార్యక్రమం చేపడతామని ఎంఈ తెలిపారు. అంతవరకు రాంజల నల్లచెరువు నీటిని తాగవద్దని పట్టణవాసులకు సూచించారు.

చెట్టు విరిగిపడడంతో పైప్‌లైన్ ధ్వంసం

ఆదోనిటౌన్: ఆదోని పట్టణానికి తాగునీటిని అందించే రాంజల నల్లచెరువు వద్ద గురువారం అకస్మాత్తుగా పెద్ద నేరేడు చెట్టు విరిగిపడడంతో తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. దీంతో తాగునీరు వృథాగా పారింది. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి రాంజల నల్లచెరువు ఫిల్టర్ బెడ్లకు పంపింగ్ అయ్యే రా వాటర్ పైపులైన్ పగిలిపోయింది. 680 ఎంఎం పైపులైన్‌పై భారీ చెట్టు విరిగి పడడంతో పైపులైన్ తునాతునకలయ్యింది. దీంతో తాగునీటి సరఫరా ఆగిపోయింది. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు వాటర్ వర్క్స్ ఎంఈ చలపతిరావు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి సిబ్బంది చేత మరమ్మతు పనులను చేపట్టారు. 1వ వార్డు, 16, 27, 28, 30, 31, 33, 40, 41, 42 వార్డుల్లో ప్రజలకు తాగునీరు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఎంఈ చలపతిరావు కోరారు. మరమ్మతులు చేపట్టేందుకు 24 గంటల నుంచి 36 గంటల సమయం పట్టవచ్చని ప్రజలు గమనించాలని కోరారు.



భారీ చెట్టు విరిగిపడడంతో పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కొలువుదీరిన పాలకులు అమలు చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, నాయకుడు గోవిందు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పట్టణ కమిటీ నాయకులు సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ పిఎం కిసాన్‌పై సంతకం చేయడం కొత్త సీసాలో పాత సార అని అభివర్ణించారు. రైతులకు ఇచ్చిన అనేక హామీలను మొదట అమలు చేయాలన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఆదోని మండలం పాండవగల్లులో సీపీఎం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు రాముడు, లక్ష్మినర్సయ్య, సురేష్, అబ్దుల్లా, వెంకటేష్, రవికుమార్, నామాల రాముడు, ప్రవీణ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.